

# పాపులర్ రచనలు చేయుటం ఎలా?

## యండమూరి వీరేంద్రనాథ్

(క్రిందటిసంచిక నుంచి తరువాయి)

*పాత్రలలో భిన్నత*

ఒక రచయిత ఎక్కువ నవలలు వ్రాసినప్పుడు ఒకే రకమయిన పాత్రపోషణ కొన్ని నవలల్లో కనబడటం తప్పని సరి. ఇది ఇంగ్లీషు రచయితల్లో కూడా ఎక్కువ కనపడుతుంది. సిడ్నీ షెల్డన్ నవలల్లో చాలా దృఢమైన మనస్తత్వం కలిగిన హీరోకానీ, ముసలి స్త్రీ కానీ ఉంటారు. అలాగే అయాన్ రాండ్ నవలల్లో మెటీరియలిజం, లౌక్యం తెలిసిన పాత్రలు ముఖ్యభూమిక వహిస్తాయి. జేమ్స్ హాడ్లీ ఛేజ్ నవలల్లో ఎత్తుగా, బలంగా, దృఢంగా, మొరటుగా ఉండే హీరోలు కనపడతారు.

తెలుగు నవలల్లో కొస్తే కొమ్మూరి వేణుగోపాలరావుగారి నవలల్లో ఎక్కువగా అనారోగ్యంగా ఉండే హీరోలు, తమని తాము ఎక్కువగా ప్రేమించుకునే హీరోలు, రవ్వంత సెల్ఫ్ సింపతీ ఉన్నవాళ్ళు ఎక్కువ కనపడతారు. అదే విధంగా ఆ నవలలన్నింటిలోనూ మెడికల్ బ్యాక్ గ్రౌండ్ ఎక్కువగా ఉంటుంది. ఇదేవిధంగా రాచకొండ విశ్వనాథ శాస్త్రిగారి నవలల్లో కోర్టులూ, లాయరు వృత్తి, తరచూ ప్రాధ్యాన్యత వహిస్తాయి.

యద్దనపూడి సులోచనారాణి నవలల్లో హీరోలు డబ్బున్నవాళ్ళు, బలమైన వ్యక్తిత్వం ఉన్నవాళ్ళు, కష్టపడి పైకొచ్చినవాళ్ళు అయి ఉంటారు. హీరోయిన్‌లు 'ఆత్మాభిమానం' ఎక్కువగా ఉన్నవాళ్ళు, మధ్యతరగతి అమ్మాయిలూ అయి ఉంటారు. సైడ్ హీరోస్ సాధుస్వభావులూ, మంచివాళ్ళూ అయిఉంటారు. విలన్స్ దాదాపు ఉండరు. అదే మల్లాది వెంకటకృష్ణమూర్తి నవలల్లో హీరోలు భార్యలపట్ల అనుమానస్తులు, హీరోయిన్‌లు చిలిపితనం, అల్లరితనం ఎక్కువగా ఉన్నవాళ్ళు అయ్యుంటారు. లేదా భర్తవల్ల శూన్యత అనుభవించేవాళ్ళు, భర్తతో సుఖాలు పొందలేనివాళ్ళు అయి ఉంటారు.

కాలేజీల్లో పనిచేసే అధ్యాపకులు రచయితలైతే ఆ నవలల్లో కాలేజీ వాతావరణం, స్కూలు వాతావరణం ఎక్కువగా ఉండడం మనం గమనిస్తాం, పోలీసాఫీసర్లు రచయితలైతే హీరోలందరూ పోలీసాఫీసర్లు అవటం కూడా గమనించవచ్చు.

నా రచనల్లో ఎక్కువగా మేధావులైన, ధనవంతులైన హీరోయిన్‌లు, అత్యంత ధీరోదాత్తులైన హీరోలూ ఉంటారు. వేదాలు చదువుకున్నవాళ్ళు కూడా అప్పుడప్పుడూ కనబడుతూ ఉంటారు. హీరోల దవడ కండరాలు బిగుసుకుంటూ ఉంటాయి. విలన్స్ పచ్చి రక్తం తాగేవాళ్ళై ఉంటారు. సైడ్ హీరోయిన్స్ హీరోల స్నేహితురాళ్ళు అయ్యుంటారు. కానీ వాళ్ళిద్దరి మధ్య పవిత్ర స్నేహం కొనసాగుతూ ఉంటుంది. హీరోల స్నేహితులు జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకున్న వాళ్ళై ఉంటారు.

ఈ విధంగా ఎక్కువ నవలలు వ్రాసేవాళ్ళు తమ కిష్టమైన పాత్రల పట్ల అభిమానం కలిగి తమ నవలల్లో అదే పాత్రలను తరచు ఉపయోగిస్తూ ఉంటారు.

వీలైనంతవరకు దీన్ని రచయిత అధిగమించాలి.

తను ఏ జీవిత విధానాన్నైతే అభిలషిస్తున్నాడో లేదా ఏ రకమైన వృత్తిలో బతుకుతున్నాడో అటువంటి హీరోలను, హీరోయిన్‌లను సృష్టించటం రచయితలకూ, రచయిత్రులకూ పరిపాటి. తెలియకుండానే కలంలోంచి ఆ పాత్రలు జాలువారుతూ ఉంటాయి. ఒకటి

రెండు నవలలు వ్రాసే రచయితలకైతే పరవాలేదు కాని, ముప్పై, నలభై నవలలు వ్రాసి పాపులర్ అవ్వాలనుకునే రచయితలు విభిన్నమైన పాత్రలను సృష్టించటం తప్పనిసరి. ఎప్పుడూ ఒకే రకమైన పాత్రలని సృష్టిస్తూ ఉంటే అది పాఠకులకి అలవాటైపోతుంది. భిన్నత కావాలి. కొత్త కొత్త కోణాలు సృష్టించాలి.

అయితే ఇందులో ఒక రకమైన చిక్కు కూడా ఉంది. రచయిత ఏ విధంగా వ్రాస్తాడో పాఠకులకి తప్పనిసరిగా తెలియాలి. ఉదాహరణకి అమితాబ్ బచ్చన్ సినిమాకి వెళ్ళిన ప్రేక్షకుడు అమితాబ్ బచ్చన్ నుంచి మంచి పాటలు, ఫైట్స్ ఆశిస్తాడు. అదే విధంగా నసీరుద్దీన్ షా సినిమాకి వెళ్ళిన ప్రేక్షకుడు అతని నుంచి విభిన్నమైన నటనని ఆశిస్తాడు. అలా కాకుండా అమితాబ్ బచ్చన్ ఒక శాలువా కప్పుకుని, మొదటి నుంచి చివరి వరకూ జీవితపు నగ్న సత్యాలు చెపుతూ ఉంటే ప్రేక్షకుడు చూడడు. అలాగే ఎప్పుడూ రొమాంటిక్ రచనలు చేసే రచయిత అది మానేసి, సామాజిక స్పృహతో ఒక రచన చేస్తే పాఠకుడు చాలా నిస్పృహ చెందుతాడు. దీన్నే 'బ్రాండ్' అంటారు. ఒక రచయిత, వేసుకున్న రచయితగా కొనసాగాలా, లేకపోతే విలక్షణమైన రచనలు చేసే రచయితగా కొనసాగాలా అన్నది నిర్ణయించుకోవాలి.

విలక్షణమైన రచయితగా కొనసాగటం చాలా కష్టం. అంతే కాకుండా ఈ పద్ధతిలో ఎక్కువ పాపులర్ అవ్వటం కూడా కష్టమే. చందుసోంబాబు వేదాంతం వ్రాసినా, సులోచనారాణి సైంటిఫిక్ ఫిక్షన్ వ్రాసినా, ఆ పుస్తకం ప్రారంభించిన పాఠకులు షాక్ అవుతారు.

తాము ఎక్స్‌పెక్ట్ చేసేదే పాఠకులకు కావాలి.

దీనికి మరో ఉదాహరణగా మన సినిమాల్లో యాక్ట్ చేసే క్యారెక్టర్ నటుల్ని చెప్పుకోవచ్చు. ఒక క్యారెక్టర్ నటుడు హీరోకన్నా బాగా నాట్యం చెయ్యొచ్చు. బాగా నటించవచ్చు. కానీ ఈ 'బాగా నటించటం' అనేదే అతనికి మైనస్ పాయింట్ అవుతుంది. హీరోగా కాకుండా అతడు క్యారెక్టర్ నటుడిగా స్థిరపడవలసి వస్తుంది.

ఇది చాలా క్లిష్టమైన సమస్య. ప్రతీ నవలలోనూ దాదాపు ఒకే రకమైన పాత్రలుంటే పాఠకులకి ఏ విధంగా ఇష్టం ఉండదో, విభిన్నమైన ఇతివృత్తాలు తీసుకుని వ్రాసినా కూడా అంతగానూ ఇష్టపడరు. కాబట్టి వీటి మధ్య రచయిత కరెక్టుగా బ్యాలెన్స్ చేయాలి. పాపులర్ రచనలో హీరోగాని, హీరోయిన్‌గాని ఏదో ఒక గొప్ప గుణాన్ని సొంతం చేసుకోవడం తప్పనిసరి. డబ్బు, అందం, తెలివితేటలు, ఆపద సమయాల్లో నిబ్బరంగా వ్యవహరించటం, హీరో(యిన్) పట్ల అపారమైన ప్రేమ, లేదా రవ్వంత భావుకత్వం - వీటిల్లో ఏదో ఒకటి హీరో హీరోయిన్లకి తప్పని సరిగా ఉండాలి. సామాన్య మానవుల గురించి వ్రాస్తే (పాపులర్ రచనలో) పాఠకులు అంతగా ఇష్టపడరు. అటువంటప్పుడు ఒక రచయిత తన పాత్రలని ఎన్ని రకాలుగా విభిన్నంగా సృష్టించగలడు? ఉదాహరణకి, ఒక రచయిత యాభై నవలలు వ్రాస్తే అందులో కనీసం ముప్పై నవలల్లోనన్నా హీరో ధీరోదాత్తుడు అయ్యుండాలి. ఇరవై నవలల్లో హీరోయిన్లు తెలివితేటలు కలవారై ఉండాలి. మరి రచయిత ఏం చెయ్యాలి?

వేరు (ROOT) ఏదైనా కాండం మాత్రం తేడాగా ఉండాలి. అలాగే విభిన్నమైన పుష్పాలని సృష్టించటానికి రచయిత ప్రయత్నించాలి. అలాకాకుండా పూర్తిగా చెట్టునే మార్చేస్తానంటే మాత్రం పాఠకులు నిరాశ చెందుతారు. అలా అని ఒకే చెట్టుని ప్రతిసారీ చూపించినా చాలా కష్టమే.

తెలుగు పాపులర్ నవలా చరిత్రని గమనిస్తే ఒకే విధమైన పాత్రలని సృష్టించిన రచయితలు/ రచయిత్రులందరూ తొందరగా ఫేడ్ అవుట్ అవటం మనం గమనించవచ్చు.. ఒకరిద్దరు తప్ప.

హీరోల యొక్క "వృత్తి"ని ప్రతి నవలకీ మార్చటం ద్వారా పాత్ర పోషణలో తేడా తీసుకురావచ్చు. ఒక నవలలో హీరో లాయర్రైతే (అభిలాష), మరొకదాంట్లో డాక్టరు (ప్రార్థన), వేరొకదాంట్లో చదరంగం ఆటగాడు (వెన్నెల్లో ఆడపిల్ల), మరొకదాంట్లో రంగస్థలనటుడు (ఆఖరిపోరాటం), ఇంకొకదాంట్లో చిత్రకారుడు (ప్రియురాలు పిలిచె), వేరొకదాంట్లో టెన్నిస్ ప్లేయరు ( 13-14-15), ఇంకొకదాంట్లో

పోలీసాఫీసరు - ఈ విధంగా విభిన్నమైన వృత్తులని తీసుకోవటం ద్వారా కూడా పాత్రలని విభిన్నంగా సృష్టించవచ్చు. అయితే ఈ విధమైన వృత్తులని తీసుకున్నప్పుడు ఆయా వృత్తుల గురించి కొద్దిగా తెలుసుకోవటం మంచిది. ఈ "తెలుసుకోవటం" గురించే ఈ పుస్తకంలోనే మరో చాప్టర్‌లో వ్రాస్తాను.

ఒకే పాత్రని తమ కథానాయకుడ్ని చేసుకుని కొంతమంది రచయితలు సిరీస్ వ్రాశారు. డిటెక్టివ్ నవలా సాహిత్యంలో ఈ విధమైన 'ఏకపాత్ర' కనపడుతూ ఉంటుంది. డిటెక్టివ్ యుగంధర్, వాలి, పరుశురామ్, నర్సన్ మొదలైనవారందరూ ఈ విధమైన కోవలోకే వస్తారు. అయితే రచయిత మధుబాబు వీటినుంచి వెలువడి, సాంఘిక నవలలో కూడా ఒకే పాత్రని ప్రవేశపెట్టి, దాని చుట్టూ థ్రిల్లర్ కథ అల్లడం ద్వారా ఇటీవలకాలంలో బాగా పాపులర్ అయ్యాడు.

పూర్తి సాంఘిక నవలల్లో అన్నిటిలోనూ ఒకే పాత్రని ప్రవేశపెట్టి వరుసగా నవలలు వ్రాయటం అనేది ఇంతవరకూ తెలుగు సాహిత్యంలో ఎవరూ చేయలేదు. అలా చేస్తే ఎలా ఉంటుందో వర్ధమాన రచయితలు ఎవరన్నా ఆలోచిస్తే బావుండవచ్చు. కొంతవరకూ "భవానీ శంకరం", "సురేష్" పాత్రలని యర్రంశెట్టి సాయి ఈ విధంగా వ్రాసాడు.

ఏది ఏమైనా రచయిత ఒక్క విషయం మాత్రం తప్పనిసరిగా గుర్తుంచుకోవాలి. అది సస్పెన్స్ థ్రిల్లర్ అయినా, ఒక డిటెక్టివ్ కథయినా కనీసం ముఖ్యపాత్రకయినా ఒక వ్యాపకం ఉండాలి. ఆ పాత్ర తాలూకు మనస్తత్వాన్ని, స్వభావాన్ని పాఠకులు లోతుగా అర్థంచేసుకునేలాగ చిత్రీకరించాలి. కేవలం సంఘటనలు అల్లుకుంటూ పోతే అవి ఎంత బలంగా ఉన్నాసరే, పాత్రలపట్ల పాఠకులకి అభిమానం కలగదు. ఆ నవల పాపులరైజ్ అవదు. చివరికి తులసీదళం లాంటి భీభత్సరసమైన నవలల్లో కూడా తులసి పాత్ర పట్ల సానుభూతి, శారదలాంటి విశిష్ట వ్యక్తిత్వం, అనితలాంటి అమాయకత్వం, పైడితల్లి క్రూరత్వం - ఇవన్నీ విపులంగా వ్రాయబట్టే ఆ నవల ఆ రోజుల్లోఅంత పాపులరైజ్ అయ్యింది. అదే విధంగా మధుబాబు డిటెక్టివ్ నవలల్లో కూడా అసిస్టెంట్స్ పాత్రలు, పాత్ర స్వభావాలు క్లియర్‌గా రచయిత వ్రాయటం వల్లే, అవి అపరాధ పరిశోధన నవలా సాహిత్యంలో అగ్రస్థానంలో నిలిచాయి.

పాత్ర పోషణలో ఒక్కసారి తప్పుచేస్తే దాన్ని మళ్ళీ వెనక్కి తీసుకోలేం. ముఖ్యంగా ఏ వారానికా వారం సీరియల్ పంపించేటప్పుడు తప్పు చేస్తే మరీ కష్టం.

నవలలో ఒక పాత్రని ఎంతో గొప్పగా ప్రవేశపెట్టి ఆ పాత్రని అంత గొప్పగా నవల చివరివరకూ కొనసాగించడం ఒక్కోసారి రచయితకి సాధ్యంకాదు. అటువంటప్పుడు పాత్ర పరంగా అతడు ఫెయిలయినట్టే.

ఇలాంటి ఫెయిల్యూర్ నా నవలల్లో విలన్స్ పాత్రల్లో ఎక్కువ కనబడుతూ ఉంటుంది. ఎంతో ఆర్భాటంగా మొదలైన విలన్ పాత్ర చిత్రణ, చివరికొచ్చేసరికి చాలా సాధారణంగా తేలిపోతూ ఉంటుంది.

ఇటువంటి ఆశక్తతనుంచి రచయిత తొందరగా బయటపడాలి. ఇలాంటి పొరపాట్లు రుద్రనేత్ర, ది డైరీ ఆఫ్ మిసెస్ శారద, ప్రియురాలు పిలిచె మొదలైన నా నవలల్లో విలన్స్ పాత్ర చిత్రీకరించేటప్పుడు చాలా స్పష్టంగా కనపడుతుంది.

**ఇదీ పాత్రపోషణ కథ.**

ఈ అధ్యాయంలో పాత్ర పోషణ గురించి చెప్పబడింది.

1. ఏ నవలకైనా పాత్ర పోషణ చాలా పకడ్బందీగా ఉండాలి. మంచి పాత్రలు, సందిగ్ధ పాత్రలు, చెడు పాత్రలు క్లియర్‌గా ఉండాలి.

2. చిన్న చిన్న పాత్రల ప్రభావం నవలలో చాలా ప్రాధాన్యత వహిస్తుంది. గుహుడూ, జటాయువు, శబరి, శకునిలాంటి పాత్రలు ఇందుకు ఉదాహరణలు.

3. ఒక సంఘటనని ఆహ్లాదకరంగా చిత్రీకరించటానికి కూడా చిన్న చిన్న పాత్రలు బాగా ఉపయోగపడతాయి.

4. ఒక పాత్ర యొక్క ఉదాత్తతని పాఠకులకి వదిలేయాలంటే దాని గురించి ఎంత తక్కువ వ్రాస్తే అంత అంచిది.

5. పాత్రలకి పేర్లు పెట్టేటప్పుడు పాఠకులకి కన్ఫ్యూజన్ ఉండేట్లు పేర్లు పెట్టకూడదు. అదే విధంగా పాత్ర పేరు, పాత్ర స్వభావానికి తగినట్లుగా ఉండాలి.

6. ఒక నవలలో వచ్చిన పాత్రలు, తర్వాతి నవలల్లో అదే విధమైన స్వభావాన్ని ఉండేటట్లు చిత్రీకరించటం అంత మంచిదికాదు.

వచ్చే సంచికలో నాటకీయత